తిరోగమనంలో సర్కారీ చదువు

- కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో గందరగోళంలో విద్యావిధానం
- సీబీఎస్ఈ రద్దుతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరం
- పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత



చిప్పగిరి జెడ్పీ హైస్కూల్‌లో పెచ్చులూడుతున్న వరండా పై కప్పు



చిప్పగిరి హైస్కూల్ ఆవరణలో విద్యార్థుల మధ్యాహ్న భోజనం



దౌల్తాపురంలో ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్న దృశ్యం

చిప్పగిరి: గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి సమూలంగా మార్పులు చేసి పేదలకు ఉన్నత స్థాయి విద్య, సౌకర్యాలను అందుబాటులో ఉంచింది. అయితే వంద రోజుల క్రితం అధికారంలోకి ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ విధానాలను గాలికొదిలేయడంతో సర్కారీ చదువు తిరోగమనంలో సాగుతోంది. మూడు నెలల క్రితం వరకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ ఐదేళ్ల కి్రతం ఉండే స్థితికన్నా దిగజారుతున్నాయి. గందరగోళ నిర్ణయాలతో ఏ క్షణాన ఏ నిర్ణయం అమలు చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

జగనన్న హయాంలో..

ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో విద్యావ్యవస్థను నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమూలంగా ప్రక్షాళించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు మిన్నగా తీర్చిదిద్దారు. సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అమలు, నాణ్యమైన పౌష్టికాహారం అందిజేందుకు జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచంతో పోటీ పడేందుకు పేద విద్యార్థులు దూరమయ్యే అవకాశముంది. నేటికీ అమ్మ ఒడి అందజేయకపోవడం, నాడు-నేడు కార్యక్రమాల అమలు నిలిపివేతతో విద్యార్థులు కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రస్తుతం విద్యావ్యవస్థ తిరోగమనంలో పయనిస్తోందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో జెడ్పీ హైస్కూల్స్ 5, ప్రాథమికోన్నత పాఠశాలలు 14, ప్రాథమిక పాఠశాలలు 6, ఒక కేజీబీవీ ఉన్నాయి. వీటిలో మొత్తం 3,167 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత..

మండలంలోని ప్రాథమిక ,ప్రాథమికోన్నత ,జెడ్పీ హెచ్ హై స్కూల్ ,పాఠశాలలకు మొత్తం 210 మంది ఉపాధ్యాయులు కావాల్సి ఉండగా కేవలం 168 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మండలంలోని ఏరూరు గ్రామంలో 12మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు బోధిస్తుండగా, దౌల్తాపురం లోని పాఠశాలలో 43 మంది పిల్లలు, డేగులహాలు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో 37 మంది విద్యార్థులుండగా ఆయా గ్రామాల్లో ఒక ఉపాధ్యాయుడు మాత్రమే బోధన సాగిస్తున్నాడు. మొత్తం మూడు గ్రామాల్లోని 93 మంది విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి కేవలం ఒక్కొక్కరు మాత్రమే ఉపాధ్యాయులు బోధిస్తుండడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు.

వసతుల లేమి..

అధిక శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీటి వసతి లేదు. ప్రభుత్వం మంజూరు చేసి వాటర్ ప్లాంట్‌లకు మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారడంతో విద్యార్థులు బోర్లు, చేతి పంపులను ఆశ్రయిస్తున్నారు. ఇక తగినన్ని తరగతి గదులు లేక ఆరుబయట, చెట్ల కింద, వరండాలో తరగతులు నిర్వహిస్తున్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 479 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా స్థలం లేకపోవడంతో చెట్ల కింద పాఠశాల ఆవరణలో దుమ్ము,ధూళిలోనే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఇక వరండా పెచ్చులూడుతుండటంతో ఎప్పుడు ఎవరిమీదర పడుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేదు.

సీబీఎస్ఈ బోధనే మేలు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే గత ప్రభుత్వం అమలు చేసిన సీబీఎస్ఈ విద్యా విధానాన్ని కొనసాగించాలి. ఉన్నత చదువులు చదవాలన్నా, ఉన్నతమైన కొలువులు సాధించాలన్నా చిన్న తనం నుంచే నాణ్యమైన బోధన అందించాలి. ప్రస్తుతం ప్రభుత్వం చెపడుతున్న మార్పులతో పేద విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది.

– సంతోష్, 9వ తరగతి, చిప్పగిరి

కార్పొరేట్ పాఠశాలల కోసమే ఈ మార్పులు



కూటమి ప్రభుత్వం విద్యావిధానంలో చేపట్టిన మార్పులు చూస్తుంటే కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేలా ఉన్నాయి. పేద విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా గతంలో జగన్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేస్తే, ప్రస్తుతం దానికి పూర్తి భిన్నంగా, మళ్లీ పదేళ్ల క్రితం నాటి పరిస్థితులను కల్పిస్తున్నారు. ఈ విధానాలతో విద్యా విధానం గందరగోళంగా మారింది. పాలకుల నిర్ణయాలు సరిగా లేవు. పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విద్యార్థులను తీర్చిదిద్దాల్సింది పోయి దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు.

– జూటూరు మారయ్య, చిప్పగిరి

క్లుప్తంగా

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో

తుగ్గలి : క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు అన్నారు. పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ పాండురంగరాజు ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్లు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 24, 25 తేదీల్లో పత్తికొండలో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాండురంగరాజు తెలిపారు. పీడీలు చందూ నాయక్, వేణుగోపాల్, హనుమన్న, ఆంజనేయులు, సలోమి, జయలక్ష్మి, మహేశ్వరి, ఎస్‌ఎంసీ చైర్మన్ అమీనాబేగం పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం



గోవిందప్ప స్వామి కాలనీలో మట్టి రోడ్డు వేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

చిప్పగిరి: స్థానిక గోవిందప్ప స్వామి కాలనీలో వర్షం వస్తే నీరు పోవడానికి వీలు లేకుండా ఉండడంతో నీరు నిలిచి దుర్వాసనతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో 'వర్షపు నీరు వెళ్లేదెలా'? అని సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర గురువారం కాలనీలో నీరు నిలువకుండా మట్టి రోడ్డు వేసి సమస్య పరిష్కరించారు.

విద్యార్థులకు హాకీ స్టిక్స్ అందజేత



విద్యార్థులకు హాకీ స్టిక్స్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవనకొండ: తెర్నేకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయిలో హాకీలో రాణించిన పూర్వ విద్యార్థులు పెద్దయ్య, ప్రభాకర్, విజయానందం, ప్రతాప్, గోపాల్, శివ, ఖాజా, భీమయ్య, జయరాముడు తమ సొంత ఖర్చులతో హాకీ స్టిక్స్ కొనుగోలు చేసి క్రీడాకారులకు గురువారం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ అరుణ్‌కుమార్ చేతులమీదుగా హాకీ స్టిక్స్‌ను క్రీడాకారులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీఎంసీ చైర్మన్ ఉప్పర వీరేష్, ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు, ఉప సర్పంచ్ భర్త బెల్లు ఈరన్న, మాజీ ఎంపీటీసీ చాప ఈరన్న పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

మద్దికెర : ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత గురువారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొని వంద రోజుల పాలనపై సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసి డోర్ స్టిక్కర్స్ అతికించి కరపత్రాల ద్వారా వివరించాలని సూచించారు. గ్రామసభల్లో మండల అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

పోషకాహారంతో ఆరోగ్యకరమైన జీవనం



పోషణ్ మాహాలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ(తుగ్గలి) : పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా 'పోషన్ మహా' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన పోషణ పదార్థాలను పరిశీలించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. ఆర్డీఓ రామలక్ష్మి, సీడీపీఓ లలిత, సీఐ జయన్న, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు: అరికెర అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు అభిషేక్, జగన్ వైఎస్సార్ కడప జిల్లాలో ఈనెల 21 నుంచి అండర్– 14 విభాగంలో జరగనున్న హ్యాండ్ బాల్ పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యారని పాఠశాల పీడీ మనోజ్ రాజ్ గురువారం తెలిపారు. విద్యార్థు లు రాష్ట్రస్థాయిలో సత్తా చాటని ఆకాంక్షించారు. తెలుగు ఉపాధ్యాయుడు సి.నరసింహులు, ఆర్టిస్టు అచ్చయ్య వారికి టీషర్టులను అందజేసి అభినందించారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

దేవనకొండ: 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ శుక్రవారం నుంచి జరుగుతాయని మండల కో–ఆర్డినేటర్ మద్దిలేటి తెలిపారు. గురువారం స్థానిక పి.కోటకొండ జెడ్పీ పాఠశాలలో పీడీలు, పీఈటీలతో సమావేశమై మాట్లాడారు. శుక్రవారం స్థానిక పి.కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఇదులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (షటిల్), యోగా, అథ్లెటిక్స్, చెస్ క్రీడల్లో పాల్గొనేందుకు మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు తాలూకా స్థాయిలో ఈనెల 23, 24, 25వ తేదీల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. పీడీలు రామచంద్రుడు, శ్రీలత, వీణ, కేజీబీవీ లీలావతి, పీఈటీలు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



ముళ్లకంచెలను తొలగిస్తున్న ప్రొక్‌లెయిన్

ఆలూరు: స్థానిక ఎన్జీవోస్ కాలనీ రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని గ్రామ సర్పంచ్ అరుణాదేవి, ఈఓ ప్రకాష్‌నాయుడుకు పలు మార్లు తెలియజేశారు. అయినా వారి నుంచి స్పందన కొరవడటంతో గురువారం కాలనీవాసులు విషపురుగుల బారి నుంచి రక్షించుకోవడానికి రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను సొంత ఖర్చులతో తొలగించుకున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, శానిటేషన్ సిబ్బంది కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లకపోవడం, ఫాగింగ్ చేయక పోవడం దారుణమన్నారు. పనులు చేయకపోయినా కుళాయి, ఇంటి పనులకు చెల్లించాలని మాత్రం కాలనీవాసులపై ఒత్తిడి చేయడం సరికాదన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



ఆర్డీవో రామలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పత్తికొండ(తుగ్గలి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు కోరారు. వాల్మీకి బోయ విప్లవ బైక్ యాత్రలో భాగంగా గురువారం పత్తికొండలో ఆర్డీవో రామలక్ష్మి, రూరల్ సీఐ పులిశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ..2019, 2024 ఎన్నికల సమయంలో వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేరుస్తామని ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట ఇచ్చారన్నారు. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా మన రాష్ట్రంలో కూడా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు వారిపై అక్రమంగా ఓపెన్ చేసిన రౌడీషీట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతినాయుడు, జిల్లా అధ్యక్షుడు అర్జున్, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

బోయలపై రౌడీ షీట్లు తొలగించండి

వెల్దుర్తి: వాల్మీకులపై ఉన్న అక్రమ రౌడీ షీట్స్ తొలగించాలని, పోలీసు యాక్ట్ ప్రకారం 5ఏళ్ల ఎలాంటి కేసులలో లేని వారిని షీట్స్ నుంచి తొలగించాలని కోరుతూ ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు జిల్లా, మండల నాయకులతో కలిసి గురువారం వెల్దుర్తి సీఐ మధుసూదన్ రావుకు వినతిపత్రం అందజేశారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

హొళగుంద: సీజనల్ వ్యాధులు సోకకుండా జీవాలు, పశువులను పెంపకందారులు జాగ్రత్తగా చూసుకోవాలని పశువైద్యులు సూచించారు. బొమ్మగుండనహళ్లి (బీజీ హళ్లి) గ్రామంలో గురువారం రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు వైద్య శిబిరం నిర్వహించారు.వెటర్నరీ అసిస్టెంట్లు జిలాన్, కార్తీక్ మాట్లాడుతూ పశువులకు గాలికుంటు ఇతన వ్యాదులు సోకిపాలివ్వవని, తీవ్ర అస్వస్థతకు గురవుతాయని జాగ్రత్తగా ఉండాలని రైతులకు సూచించారు. ఆర్డిప్ ప్రతినిధి నాగరాజు, విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్స్ శేఖర్, వనికేరప్ప పాల్గొన్నారు.

పోషకాహారంతో బిడ్డకు ఆరోగ్యం



వెల్దుర్తిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టే బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐరన్ అధికంగా ఉండే ఆహారంతో పాటు ఐరన్ మాత్రలు తీసుకోవాలని సూచించారు.

వెల్దుర్తి: గర్భం దాల్చిన నాటి నుంచి పిల్లలకు మూడేళ్లు వచ్చే వరకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల, పిల్లలకు తల్లి పాల నుంచి బలవర్ధక ఆహారం అంది తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ వెల్దుర్తి ప్రాజెక్ట్ సీడీపీఓ ల్యూక్ అన్నారు. గురువారం స్థానిక 3వ సచివాలయం పరిధిలోని 1,8,9,12వ నంబరు అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్లు సునీత, సరస్వతి, శ్రీదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. పలువురు గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. 8వ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ గర్భవతులు, బాలింతలతో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవాలు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో జరుగుతాయన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్.. పంటల నమోదుకు నిరీక్షణ



చిప్పగిరిలో రైతు సేవా కేంద్రంలో నిరీక్షిస్తున్న రైతులు

చిప్పగిరి: పంటల నమోదు, ఈ– కేవైసీకి ఈ నెల 23 వరకు ప్రభుత్వం గడువు పెంచడంతో గురువారం స్థానిక రైతు సేవా కేంద్రానికి, చిప్పగిరి, కుందనగుర్తి గ్రామాల నుంచి పదుల సంఖ్యలో రైతులు ఈ– క్రాప్ నమోదుకు ఉదయాన్నే వచ్చారు. ఉదయం 11 గంటల వరకు సర్వర్ పని చేసి ఆ తరువాత మొరాయించడంతో రైతులకు నిరీక్షణ తప్పలేదు. గంటల కొద్దీ నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. పనులు మానుకొని పంటల నమోదు కోసం వస్తే సర్వర్ మొరాయించడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 15,550 ఎకరాల్లో పంటల నమోదు, 11,000 ఎకరాలకు సంబంధించి ఈ – కేవైసీ పూర్తి చేసినట్లు ఏఓ విజయలక్ష్మి తెలిపారు.

పరిశుభ్రతను పాటించండి



హొళగుంద తేరు బజారులో చెత్త, చెదారం తొలగిస్తున్న దృశ్యం

హొళగుంద: పట్టణంలోని తేరుబజారులో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. సిద్దేశ్వరస్వామి తేరు బజారులో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

గుంతలు పూడ్చివేత

హాలహర్వి: ఇటీవల కురిసిన వర్షాలకు హాలహర్వి–గూళ్యం రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్ర గోతులను పూడ్చించే పనులు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా గుంతలను మట్టితో పూడ్చి వేయిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు గ్రామం వద్ద గురువారం కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ తెలిపారు. మండలంలో అక్రమ మద్యం అరికట్టేందుకు వాహనాల తనిఖీ చేస్తుండగా కోసిగి మండలం కడదొడ్డి గ్రామానికి చెందిన బొంపల్లి ఈరన్న, కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన నరసింహులు ద్విచక్ర వాహనంపై కర్ణాటక నుంచి 6 బాక్సుల కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను తీసుకొస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

ఆ ఉపాధ్యాయిని ఏమైనట్లు ?



ఉపాధ్యాయులను విచారిస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణా రెడ్డి (ఫైల్)

ఆలూరు: హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామ జెడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని పి.నవభారతి దాదాపు 11 రోజులుగా విధులకు హాజరు కావడం లేదని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, హెచ్‌ఎం అబ్దుల్ హకీం తెలిపారు. ఆమె గైర్హాజరుపై డిప్యూటీ ఈఓ ఇటీవల పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు, విద్యార్థులను విచారించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తామిద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఈనెల 9న తాను పాఠశాలకు హాజరు కాలేనంటూ ఆమె వాట్సాప్ ద్వారా మేసేజ్ చేసిందని చెప్పారు. సెలవు పెట్టకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: పట్టణంలోని బావాజీపేటకు చెందిన బోయ శివ అనే వ్యక్తి 30 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా గురువారం రాత్రి మండలంలోని ఇస్వీ గ్రామం సమీపంలోని జోడి బసవేశ్వరస్వామి ఆలయం వద్ద అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర విలేకరులకు తెలిపారు.

బండలాగుడు పోటీల విజేత జమ్ములమడుగు ఎద్దులు



పోటీలను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం న్యూ కేటగిరి వృషభాలకు నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతగా వైఎస్సార్ జిల్లా జమ్ములమడుగు ఉండెల గురు విజయకుమార్ రెడ్డి వృషభాలు నిలిచి రూ.40వేల బహుమతిని గెలుచుకున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రారంభించిన పోటీల్లో తర్వాతి నాలుగు స్థానాలలో వరుసగా నాగర్ కర్నూలు జిల్లా పెంటవెల్లి మండలం కొండూరు గ్రామ నల్లబోతుల లక్ష్మీగోపాల్ వృషభాలు, నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తకోట గ్రామ కరుణాకర్ ఎద్దులు, కర్నూలు జిల్లా రేమట గ్రామ ఊరువాకిలి నడిపి గిడ్డయ్య నాయుడు వృషభాలు, అనంతపురం జిల్లా అక్కంపల్లి గ్రామ కోనేపల్లి ఇంద్రారెడ్డి ఎద్దులు నిలిచి రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు గెలుచుకున్నాయి. విజేత వృషభాల యజమానులకు ఆలయ కమిటీ సభ్యులు, దాతలు నగదు బహుమతులందించారు. 20న సీనియర్స్ విభాగంలో వృషభాలకు బండలాగుడు పోటీలు ఉంటాయని, విజేతలకు వరుసగా రూ.70వేలు, రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు అందివ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత, సర్పంచ్ సుహాసిని అన్నారు. గురువారం స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాలలో భాగంగా విద్యార్థులతో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రధాన బస్టాండు వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లయిన సందర్భంగా స్వచ్ఛ భారత్ దివస్‌ను ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓ శివకుమార్, హెచ్‌ఎంలు దేవేంద్రప్ప, అజరయ్యాబాబు, పంచాయతీ సభ్యులు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కౌతాళం దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలను చేపట్టారు.

22 నుంచి దశమి ఉత్సవాలు



చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయం

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీ ఆది చింతలాముని రంగడు, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 22న రాత్రి 2 గంటలకు స్వామివారి పల్లకీ సేవతో ప్రారంభం అవుతుంది. 23న దశమి మహోత్సవం, 24న మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు, 25న పారువేట ఉత్సవం కనుల పండువగా సాగనున్నాయి. 26న స్వాముల వారి ఆరాధన ఉత్సవాలతో దశమి ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు ఆలయ కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.

లక్ష్య సాధనకు చర్యలు



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఎమ్మిగనూరుటౌన్: వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లకు నిర్దేశించిన ఆదాయ లక్ష్య సాధనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజినేయులు తెలిపారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఆయన పరిశీలించారు. మార్కెట్ ఆదాయం తదితర అంశాలను యార్డ్ కార్యదర్శి పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. మార్కెట్ యార్డ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ రీజినల్ పరిధిలో ఇప్పటి వరకు 8జిల్లాల పరిధిలో మార్కెట్ యార్డ్‌లలో రూ.130 కోట్ల సెస్ వసూలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.40 కోట్ల మేర వసూలు చేసినట్లు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో రూ.36 కోట్లు వసూలు చేయాల్సి వుండగా రూ.10కోట్ల మేర వసూలైనట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రెండు విజిలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి పంటల దిగుబడులు బయటికి పోకుండా చెక్ పోస్టులను బలోపేతం చేసి సెస్‌లను వసూలు చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు.